



పగలంతా లోకానికి వెలుగులు పంచి అలసిపోయిన సూర్యదీపం, పడమటి దిశకు తిరిగి రెపరెపలాడుతోంది

కాంతమ్మగారు పడి వున్న మంచానికి ఆనుకునేలా చెక్క కుర్చీ వేసుకుని కూర్చుంటూ, 'నాయనమ్మా' మెల్లిగా పిలిచింది గీత కాంతమ్మగారు శూన్య దృక్కులతో మనవరాలి పంక చూశారు

చేతిలో వున్న భగవద్గీతను వొడిలోకి సర్దుకొని, కుర్చీలోనే పద్మాసనం వేసుకుంటూ నెమ్మదిగా చెప్పింది గీత 'నాయనమ్మా, ఈ వేళ నీ ఆరోగ్య పరిస్థితి మెరుగయిందని డాక్టరు చెప్పారు నిజానికి నాన్న కోసం, నా కోసం బెంగ పెట్టుకొని ఆ దిగులుతోనే యిలా అయిపోయావు నువ్వు ఇక మేం వచ్చేశాంగా, నీకేం ఫరవాలేదు నాన్న తిరిగి అమెరికా వెళ్ళిపోయినా నేను మాత్రం నీ దగ్గరే వుండిపోతాను నాయనమ్మా! మునుపటి లానే రోజూ నీకు బగవద్గీత చదివి వినిపిస్తూంటాను, ఏం!" చిన్న పిల్లలా అమాయకంగా చెబుతున్న పదహారేళ్ళ మనవరాలి కంఠంలో 'నాయనమ్మ యింకా కొన్నాళ్ళ పాటు బ్రతకాలి' అనే కోరిక ధ్వనించి, క్షణం పాటు కాంతమ్మగారి తనువు, మనసు పులకించాయి

సమాధానంగా ఆమె నోరు తెరిచి ఏదో చెప్పాలనే వ్యర్థ ప్రయత్నంలో భాగంగా ఆ ఎండిన పెదాల మీద శుష్కించిన చిరునవ్వు వొకటి కదిలింది

ఆ నవ్వుకి అర్థం గీతకు స్పష్టంగా తెలుసు

'-పిచ్చి తల్లీ! కాలాన్ని ఆపడం ఎవరి తరమూ కాదురా! నాకు టయిమొచ్చేసింది అంతులేని మనోవేదనతో కొట్టు మిట్టాడుతూ నిన్నటి దాకా చూరుపట్టుకు వేలాడిన యీ ప్రాణం, యీ సారి ఆనందంగా, తృప్తిగా యీ కట్టెను విడిచి మీ తాతయ్యను చేరుకుంటుందిరా ' నాయనమ్మ మాట్లాడుతున్నట్లే అనిపించింది గీతకు


అవును, నాయనమ్మ చూపుల్లోనూ, నవ్వులోనూ, ఆమె మనోభావాల్ని చదవగలదు గీత, ఆమెతో గీతకున్న అనుబంధం అట్లాంటిది

కాంతమ్మగారి పెద్ద కొడుక్కి కలిగిన ఏకైక సంతానం గీత చిన్న కొడుకు పిల్లలకి, చుట్టపు చూపుగా వచ్చిపోయే కూతురు బిడ్డలకి నాయనమ్మ దగ్గర గీతకున్నంత చనువు లేదు ఆమెకు కూడా యీ మనవరాలంటే పంచప్రాణాలు అందుక్కారణం- ఆ పిల్ల భూమ్మీద పడిన మరుక్షణం తల్లిని పోగొట్టుకున్న దురదృష్టవంతురాలవడం వల్లనూ, అప్పట్నుంచీ ఏడాది క్రితం వరకూ తన సంరక్షణలోనే పెరగడం వల్లనూ మాత్రమే కాదు, గీతకు అన్నీ తన భర్త నరసింహారావు పోలికలే వచ్చాయని కాంతమ్మ గారికి గట్టి నమ్మకం 'ఆ పట్టుదల, పెంకితనం, ఆశయాలు- అన్నీ మీ తాతయ్య లక్షణాలే వచ్చాయిరా తల్లీ నీకు!" -అంటూ అప్పుడప్పుడూ మనవరాలిని దగ్గరకు తీసుకొని మురుసుకునేదామె

"పెద్దయ్యాక గంపెడు పిల్లల్ని కని సంతాన లక్ష్మిలా వర్ధిల్లమని కాంతమ్మగారు దీవిస్తుంటే.. నేను అస్సలు పిల్లల్ని కననుగా' అని గీత గారాలు పోతూ మారాం చేస్తుంటే చూసి, ఆమె ఆశ్చర్యపోయేది- 'ఆయన కూడా ఇట్లాగే అనేవారు' అని స్వగతం అనుకొని పైకి మాత్రం తప్పు తల్లీ, అట్లా అనకూడదు 'అమ్మా' అనిపించుకోడంలోనే వుంది ఆడజన్మకు సార్థకత మాతృత్వంలోని మాధుర్యానికి నోచుకోని ఆడబ్రతుకు వ్యర్థం. !" అంటూ చుట్టూ వున్న వాళ్ళకి వినిపించేలా చెప్పేవారు కాంతమ్మగారు

గీతకు ఆరేళ్ళ వయసప్పుడు నాయనమ్మ దగ్గర విడిచిపెట్టి అమెరికా వెళ్ళిపోయాడు గీత తండ్రి

కన్నకూతురు ఎలాగూ కళ్ళ ముందు లేదు. ఉన్న కొడుకు లిద్దరిలోనూ వొకడు దేశంకాని దేశం వెళ్ళిపోతానంటే భరించలేకపోయారు కాంతమ్మ గారు అమెరికాలో, చికాగోలో అసిస్టెంటు ఇంజనీరుగా హోదా అయిన వుద్యోగంలో స్థిరపడ్డం



అతని అదృష్టంగా అంతా భావిస్తుంటే.....

"ఇంత చదువూ చదివించింది, నిన్ను అంత దూరం పంపించడానికా నాయనా!.... కన్న పేగును చివర దశలో కలవర పెట్టకురా! భర్తను పోగొట్టుకున్న దౌర్భాగ్యురాల్ని, బిడ్డ కూడా దూరమై బ్రతక లేనురా... నా మాట విను నాయనా!" అంటూ గొల్లు మన్నారు కాంతమ్మగారు.

ఆమె ఎంత మొత్తుకున్నా అతను పట్టించుకో లేదు. ఆఖరికి...., కావాలంటే మనవరాలిని దగ్గర అట్టే పెట్టుకొమ్మని చెప్పి గీతను ఆమె వద్ద విడిచి పెట్టి విమానం ఎక్కేశాడు

నాటి నుంచీ గీతలోనే పెద్ద కొడుకుని కూడా చూసుకోడానికి అలవాటు పడ్డారు కాంతమ్మగారు అయినా అప్పుడప్పుడూ హృదయంలో తన్నుకులాడే మమకారాన్ని అణచలేక యే నడిరాత్రి వేళో ఎవరూ చూడకుండా దిండులో ముఖం దాచుకొని కరువు తీరా యేడ్చి, తాత్కాలిక వుపశమనం పొందేవారామె.

భర్త మిగిల్చిన పది ఎకరాల మాగాణీ భూమిని ఎండిస్తూ ఇంటి బాధ్యతలు స్వీకరించిన చిన్నకొడుకు ఎదురుగానే వున్నా ఆమె మనసు తృప్తి పొందలేకపోయింది పైగా అతనితో కలిసి వుంటే– ఎక్కడ ఆ తల్లి లేని పిల్ల మనసు గాయపడే పరిస్థితి ఎదురవుతుందో అనే భయంతో, ఆ ఇంట్లోనే వేరేగా వుంటూ గీతను కడుపులో పెట్టుకొని సాకింది ఆమె

ఏడాది క్రితం వొకనాడు పెద్దకొడుకు వచ్చి, అమ్మాయి యీ వయసులో కూడా యిక్కడే వుంటే భవిష్యత్తు దెబ్బ తింటుంది అని చెప్పి వెంట బెట్టుకు పోయాడు ఆ తరవాతే కాంతమ్మగారి పరిస్థితి మరీ అధ్వాన్నమైపోయింది సముద్రాల కావల వున్న కొడుక్కీ, మనవరాలికి ఆఖరి చూపు దక్కకుండా ఏ క్షణంలో తను గుటుక్కు మంటుందోననే మరణ భయం ఎక్కువైంది ఏడుపు కంటె అనంతమైన దిగులు ఆమెను ఆవరించింది, ఆ దిగులే ఆఖరికి ఆమెను మంచంలో పడేసింది, గొంతు పడిపోయినా చూపు మాత్రం మందగించలేదు. ఆలోచనాశక్తి వినికిడి శక్తీ అలాగే వున్నాయి

ఆ ముందు రోజు అమెరికా నుంచి పెద్దకొడుకు, మనవరాలు దిగే సమయానికి గూటిలోంచి చిలక ఎగిరిపోలేక కొట్టుమిట్టాడుతోందీ ఎక్కిళ్ళు కూడా ప్రారంభమయితే అంతా అయిపోయిందనే అనుకున్నారు కాని, శక్తినంతా కూడదీసుకొని అతి కష్టమ్మీద తెరుచుకున్న ఆమె కళ్ళ ముందు కన్నకొడుకు రూపం స్పష్టమవ్వగానే ఆమెలో ఏదో దివ్యతేజస్సు ప్రవేశించినట్టయి చూస్తుండగానే మనిషిలో మార్పొచ్చింది

తాము వచ్చిన తరవాత నాయనమ్మ కళ్ళల్లో చిగురించిన కొత్త కాంతిని చూడగానే గీత హృదయం అనిర్వచనీయమైన తృప్తితో నిండిపోయింది అప్పటి వరకూ మరణ భయంతో కొట్టుకులాడిన నాయనమ్మ యిప్పుడు ఆనందంగా చావుని ఆహ్వానిస్తున్నట్టు కనబడింది– కాని తిరిగి జీవకళ పరుచుకున్న నాయనమ్మ ముఖంలో వుండి వుండి యేదో అస్పష్టపు విషాదరేఖ కదులుతూండడం, ఆ సమయంలో వెన్నెల దోనెల్లా ఆమె కళ్ళు కన్నీటితో నిండిపోతూండడం, గీతను కలవరపెట్టింది'

తన గుండెను పిండుతూన్న 'ఆ విషయమే నాయనమ్మ మనస్తాపాని కూడా కారణమై వుంటుంది– అనుకుంది గీత

ఆ విషయం గురించి తను వెళ్ళి 'నాయనమ్మను బయట ఎందుకు పడుకోబెట్టారు?' అని పిన్నిని అడిగితే,

'నట్టింట్లో ప్రాణం పోతే ఇంటికి అరిష్టంట. అసలే ప్రస్తుతం పుణ్యదినాలు నడుస్తున్నాయట పంతులుగారు చెప్పారు అయినా, వసారాలో నేగా మంచం వేసింది–' నయం, వీధి వాకిట్లో వెయ్యనందుకు సంతోషించు అన్నట్టుగా చెప్పిందామె పక్కనే వున్న మేనత్త కూడా పిన్ని మాటల్ని బలపరచడం గీతకు ఆశ్చర్యాన్ని కలగజేసింది

నిజానికి అది వసారా కాదు ఉత్తరం వైపు రేకులతో చూరు దింపిన పంచ ఆ పంచలో పాతకాలం నాటి నులక మంచం ఆ మంచంలో ఎండిన కొమ్మలా కాంతమ్మగారు

ఆమెను అలా చూస్తుంటే గీతకు కడుపులో దేవినట్టయింది

కాంతమ్మగారి కళ్ళ నుంచి చంపల వరకూ పాకిన ఎండిన కన్నీటి చారికలు చూసిన గీతకు గుండె రెప రెపలాడింది.

ఆమె దృష్టి మరల్చి, మనసును ప్రశాంత పరచాలనే ప్రయత్నంగా, ముందుకు వంగి భగవద్గీతను తెరుస్తూ అడిగింది "శ్లోకాలు చదివి వినిపించమంటావా, నాయనమ్మా!"

శూన్యంలో చిక్కుబడిన చూపుల్ని విప్పకుండానే తల అడ్డంగా కదిలించారు కాంతమ్మగారు.

–భగవద్గీతను చదివి వినిపిస్తానంటే నాయనమ్మ ఎప్పుడూ అడ్డు చెప్పదు, వొక్క తాతయ్య ఆమె తలపుల్లో కదులుతున్నప్పుడు తప్ప– అని గీతకు తెలుసు. అంటే నాయనమ్మ గతాన్ని నెమరు వేసుకుంటోందన్నమాట!... ఆ విశేషాలన్నీ తనకు, పూర్వం నాయనమ్మ ఎన్నిసార్లు చెప్పి వుంటుందో

## వంధ్యత్వానికి కారణం కాఫీయా?



గర్భం ధరించనున్న స్త్రీలకు చెయ్యవలసిన, చెయ్యగూడని పనుల జాబితా ఎప్పుడూ పెరిగిపోతూ ఉంటుంది. సన్నగా ఉంటే కాస్త లావెక్కండి అని, లావుగా ఉంటే కాస్త సన్నబడండి అని, ఎక్కువగా వ్యాయామం చెయ్యకండి అని, పొగ తాగకండి అనీ, మాదకద్రవ్యాలు సేవించకండి అనీ– ఇలా ఎన్నో విధి నిషేధాలుంటాయి. ఇప్పుడు కొత్త సూచన : కాఫీ, కోలా, చాకలెట్ తగ్గించండి. కెఫైన్‌ను ఒక మోతాదులో సేవించడం గర్భం ధరించే అవకాశాలను సగానికి సగం తగ్గించిందని ఈ మధ్యనే 104 మంది స్త్రీలపై జరిపిన పరిశోధనలో తేలింది. వంధ్యత్వంపై కెఫైన్ ప్రభావం గురించి జరిపిన మొట్టమొదటి పరిశోధనలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్ (యు ఎస్ ఎ)కు చెందిన పరిశోధకులు, రోజుకు ఒక కప్పుకన్న ఎక్కువ కాఫీ సేవించిన మహిళలు గర్భం ధరించే అవకాశాలు తక్కువగా ఉన్నాయని ప్రకటించారు. ఈ పరిశోధన పరిమిత స్థాయిలో, పరిధిలో జరిగిందని, అందువల్ల ఈ ఫలితాన్ని నిర్ధారించి చెప్పలేమని నిపుణులు అంటున్నారు. ఈ ఫలితాల్ని "జాగ్రత్తగా వ్యాఖ్యానించాలని" పరిశోధకులు అన్నారు. కాని ఏ మహిళ అయినా ఏదో తెలియని కారణం వల్ల వంధ్యురాలుగా ఉంటే, కాఫీ తగ్గించడం మంచిదని నిపుణులు చెపుతున్నారు.

లెక్కలేదు

గీత మనసు పొరల్లో మెదులుతున్న సంఘటనలన్నీ సంఘటితమై దృశ్యాలుగా రూపుదిద్దుకొని, కాంతమ్మగారి కన్నుల్లో ప్రతిబింబించి ప్రతిఫలిస్తున్నాయి

-కాంతమ్మగారి భర్త నరసింహారావు గారు సింహం లాగే బ్రతికాడు వున్నన్నాళ్ళూ ఆయన మాటకు ఎదురు చెప్పే శక్తి ఎవరికీ వుండేది కాదు. అనుకున్నది చేసేవాడు. వొకరి మాటకు విలువనిచ్చే వాడు కాదు- గతాన్ని తల్చుకొని మథనపడ్డం, భవిష్యత్తును వూహించుకొని కలవరపడ్డం, ఆయనకు యిష్టం వుండేది కాదు. ఉన్న ఆస్తిపాస్తులు అనుభవిస్తూ సమస్యలకి దూరంగా నాలుగు రోజులు బ్రతికితే చాలనే వాడాయన

ఆయన ఎక్కడ వున్నా ఎప్పుడూ వెంట పది మంది స్నేహితులు వందిమాగదుల్లా అంటి పెట్టుకుని వుండే వారు ఆయనకి నాటకాల పిచ్చి వుండేది పది మందినీ పోగు చేసి తన సొంత డబ్బు ఖర్చు పెట్టి నాటకాలు ఆడిస్తూండే వారు- తరచూ ఎవరెవరో నాటకాల వాళ్ళు వచ్చి తన ఇంట్లోనే మకాం వేసేవారు అంత మందికీ కాఫీలు, భోజనాలు ఆ ఇంట్లోనే . ఎప్పుడూ వచ్చేపోయే బంధువర్గానికి అంతే లేదు కాంతమ్మగారే స్వయంగా వంటి వార్చి వడ్డించే వారు అందరికీ నిత్య సంతర్పణలా వుండేది ఆ ఇంట్లో ఖరీదైన సత్రవులా నిత్యం జనంతో కళకళలాడుతూండేది, ఆ పెద్ద మండువా లోగిలి

ఏ నాడూ పది మందికీ పెట్టడమే గాని ఆ మహరాజు తన సొంతానికి ఎప్పుడూ ఏమీ చేసుకోలేదు

భర్త ఇష్టాలను, అభిరుచులను గౌరవించిందే తప్ప, అడ్డు చెప్పడం గాని, ఎదిరించి మాట్లాడ్డం గాని ఎప్పుడూ చెయ్యలేదు కాంతమ్మగారు- ఆడదానికి ఇల్లూ, భర్తే సర్వస్వమైతే- మగాడికి లోకం, పేరు, ప్రతిష్ఠ, ఆశయాలు- యింకా ఎన్నో వుంటాయని పెద్దలు, పెదబొబ్బలు చెప్పిపొడుపులు, ఆయుదాలుగా వుపయోగించే భార్యలు సంసారాన్ని నరకప్రాయం చెయగలరేగాని భర్తను ఎప్పుడూ సన్మార్గానికి మళ్ళించలేరన్నది అక్షరసత్యమనే అతన్ని పీడించడం మొదలు పెడితే విసిగిపోయి మరింత విచ్చలవిడిగా ప్రవర్తించగలడని- అనుభవం వల్ల గ్రహించిన కాంతమ్మగారు భర్త ప్రవర్తనను ఎప్పుడూ వేలెత్తి చూపించలేదు కాని, నలభై ఎకరాల మాగాణి పదెకరాలకు తరిగిపోతున్నప్పుడు కూడా భర్తను ఆపడానికి ప్రయత్నించని ఆమె, జీవితంలో రెండే రెండు సార్లు ఆయనకి అడ్డు నిలిచి ఎదిరించారు

మొదటిసారిగా, అది పిల్లల విషయంలో జరిగింది తను పిల్లల్ని కనడానికి ఆయన ఇష్టపడే వారు కాదు పిల్లలుంటే మనం కోరి తెచ్చుకున్న సమస్యలే అని ఆయన అభిప్రాయం

మాతృత్వంలోని మాధుర్యాన్ని చవిచూడాలని కాంతమ్మగారు వువ్విళ్ళూరినప్పుడు, ఆయన నవ్వి కాంతం! మన కెందుకే ఆ యుంరూటం! నాకు నువ్వు, నీకు నేను వుండగా వేరే పిల్లలెందుకే కోరికోరి సమస్యల్ని నెత్తికెక్కించు కుంటానంటావేవిటే పిచ్చిదానా!' అతి మామూలుగా అనేవాడాయన

'అమ్మ' అనిపించుకోడంలోనే ఆడజన్మకు సార్థకత వున్నదని, మాతృత్వాన్ని పొందగలిగిన స్త్రీ ప్రపంచాన్నే జయించిన తృప్తిని పొందుతుందని, కన్నబిడ్డ తన వొడిలో కేరింతలు కొడుతుంటే- అంతవరకూ జీవితంలో ఎదురైన కష్టాలనీ, కన్నీళ్ళనీ క్షణంలో మర్చిపోగలదనీ, రొమ్మును బిడ్డ నోటికి అందించి పాలు కుడుపుతున్నప్పుడు- ఆకాశం తన ముందు తల వంచినట్టూ, పర్వతం తన పాదాల చెంత మోకరిల్లినట్టూ, సముద్రం తన నుదుట స్వేదబిందువై నిలిచినట్టూ ఆ తల్లికి అనిపిస్తుందని వూహల్లోనే అనుభవించి పలవరించి కలవరించే కాంతమ్మగారు మొదటి సారిగా ఆ విషయంలో భర్తని ఎదిరించి వాదించి, పెళ్ళయిన ఆరేళ్ళ తర్వాత మాతృత్వాన్ని సాధించుకోగలిగారు

ఆ తరువాత చాలా కాలానికి పిల్లలు ఎదిగివచ్చే సమయంలో ఇల్లు అమ్మకానికి పెడుతున్నప్పుడు రెండవసారి భర్తకు అడ్డు నిలిచారు ఆమె ఆ సందర్భంలో జరిగిన సంఘటన యిప్పటికీ ఆమె కళ్ళముందు కదలాడుతూనే వుంటుంది

బిడ్డల్ని గూడులేని పక్షులుగా మాత్రం చెయ్యవద్దని మొత్తుకుంటూ క్షణక్షణం పోరుపెడుతున్న కాంతమ్మగారు వొరోజు పెరటి వైపు అంట్లుతోముతూ ఆ విషయమే గొణుగుతూ వుంటే. .. వెనక నిలబడి వింటున్న భర్త, ఆ పక్కనే వున్న రుబ్బురోలు పొత్రం పైకెత్తి గురిచూసి విసిరేశాడు. "అమ్మా!" అన్న కూతురి అరుపుకి తుళ్ళిపడి వెనుదిరిగిన కాంతమ్మగారు, రెప్పపాటులో పక్కకు తప్పుకున్నారు. తల వెంట్రుక వాసిలో తప్పి


# ఆంధ్రసచిత్రవారపత్రిక

# నవ్వు నాలుగందాల ఆరోగ్యం!

## అందుకే నవ్వించి పారితోషికం పొందండి!

★ అందాల పలువరుస మల్లెలు రువ్వినట్లు- మెరుస్తూంటే మనం నవ్వుతూ వుంటే.... ఓహోమని వుంటుంది!

★ అట్లా నవ్వించే సన్నివేశం రాసిపంపండి నవ్వు రాకపోతే మాత్రం యిక్కడ తిట్టుకుంటారు సుమా!

★ చదవటంలోనే అలిసిపోయే సన్నివేశాలు గాక హాస్య సన్నివేశాలు కల్పించి రాయండి. – అనుభవించి రాయండి. కాపీరైటుంటే మాత్రం తస్కరించి రాయకండి– పేచీలకి మీదే బాధ్యత.

మీ హాస్య రచన ఒక యిన్‌లాండ్ కవరు మీద విడి విడి లైనులో విడి విడి అక్షరాల్లో వ్రాసి సంపాదకుడు,నవ్వు నాలుగందాల ఆరోగ్యం శీర్షిక,గాంధీనగర్– విజయవాడ– 3 కి పంపండి!

గుడ్‌లక్!!

– సం

పోయింది గాని, లేకపోతే తల రెండు ముక్కలయ్యేది..... పాత్రం విసిరిన చోట నాపరాయి ముక్కలుగా పగిలింది. ఆనాటి నుంచి యీనాటి దాకా ఆ పగులు అలాగే వుండిపోయింది. కొత్తరాయి వేయించడానికి కొడుకులు సిద్ధపడినా, ఎందుకో తనే యిష్టపడలేదు కాంతమ్మగారు.

అదేకాదు, యింకా అలాంటి గుర్తులెన్నో ఆ యింటి ప్రతి అణువులోనూ దాగివున్నాయి.... అవి వట్టి గోడలు, స్తంభాలు, చెక్కతలుపులూ మాత్రమే కాదు. వాటి వెనక తరతరాల ఆత్మీయత, అనురాగం పెనవేసుకుని వున్నాయి.

తను ఎవరికోసమైతే అంతకష్టపడి ఆ ఇంటిని నిలబెట్టిందో వాళ్ళే యీ రోజు తనని బ్రతికుండగానే ఇంట్లోంచి బయటపడేశారు – అనే విషయం తలుచుకుంటుంటే కాంతమ్మ గారి గుండెలో ముల్లు గుచ్చి కెలికినట్టుగా వుంది.

ఆమె కళ్ళు మళ్ళీ నీటితో నిండిపోయాయ్.

నాయనమ్మ మనసులో సుళ్ళు తిరుగుతున్న బాధను ఏవిధంగా తగ్గించి, ఎలా వోదార్చాలో తోచక నలిగిపోయింది గీత.

'గీతా మకరందమే' దానికి సరైన ఔషధం అని నిశ్చయించుకుంది. భగవద్గీతను తెరిచింది.

ఆమె కూడా అదే నిర్ణయానికి వచ్చినట్టుగా, కాంతమ్మ గారు చూపును గీతవంక సారించారు

అదే సమయంలో ఇంట్లోంచి స్పష్టంగా వినిపిస్తున్న సంభాషణకు ఇరువురూ ఆగి, చూస్తే

అన్నయ్యా, నువ్వెన్ని చెప్పినా – అమ్మ బ్రతికుండగా ఆస్తి పంపకాలు చెయ్యడం కుదరదు" చిన్న కొడుకు అభిప్రాయం

"చూడండి బావగారూ! మీకు చెప్పేటంతటి దాన్ని కాదుగాని, మీరు చీటికీ మాటికీ అంత దూరం నుంచి ఎలాగూ రాలేరని చెప్పి ఈ విషయాన్ని ప్రస్తుతానికి దాటవేస్తున్నామనీ, ఆ తరువాత అంతా మేమే సొంతం చేసుకోవాలని చూస్తున్నామనీ మీరనుకోవద్దు" చిన్న కోడలు భుజాలు తడుముకోడం.

'అవునురా అన్నయ్యా' తమ్ముడు చెప్పినట్టు చేస్తేనే మంచిది. తల్లికి తలకొరివి పెట్టకముందే ఆ కార్యక్రమం తలపెడితే నలుగురు ఏమనుకుంటారు చెప్పు!" కన్న కూతురి లౌక్యం.

"అదికాదురా తమ్ముడూ! నా పరిస్థితిని మీరంతా అర్థం చేసుకోవడం లేదు. ఒకసారి నేను వచ్చి వెళ్ళాలంటే ఎన్నివేలు వృధాఖర్చు! గీత పోరు పడలేకా, తల్లికి ఆఖరి చూపు దక్కనివ్వలేదనే నిందను మోయలేకా, తప్పక బయలుదేరానేగాని, నిజానికి యిప్పుడు నేను రావడం వల్ల, అక్కడ నాకు ఎంత మనీ లాస్ అయిందో మీకు తెలీదు! పోన్లే యిదే ఆఖరు సారి అనుకున్నాను.... పొలంగాని. ఇల్లుగాని నాకొచ్చేదెంతో వెంటనే తేల్చుకుని తెగ్గొట్టి అమ్మిపారేసి, సొమ్ముతో తిరిగి వెళ్ళాలనుకున్నాను. తీరా చూస్తే అమ్మ తిరిగి కోలుకుంటోంది. కొన్నాళ్ళపాటు బ్రతకొచ్చుని డాక్టరు చెబుతున్నాడు అందుకే అంటున్నాను. గుట్టు చప్పుడు కాకుండా నా వాటాకి ఏవేమొస్తాయో లెక్కగట్టి రేటుగట్టి నువ్వే ఆ సొమ్ము నా చేతిలో పెడితే సమస్య వుండదు. ఆ తరువాత నువ్వు వాటిని వుంచుకుంటావో, మంచిరేటుకి అమ్ముకుంటావో . నా కనవసరం ...!" పెద్ద కొడుకు మాటల్లో అతను నేర్చిన గణిత శాస్త్ర సారం

వాళ్ళ సంభాషణ యింకా కొనసాగుతూనే వుంది.

తండ్రి మాటలకి గీత నిశ్చేష్టురాలయింది. క్షణం తర్వాత వణుకుతున్న గుండెను నొక్కి పట్టుకుని భయం భయంగా నాయనమ్మ ముఖంలోకి చూసింది.

కాంతమ్మ గారి పెదాల మీద చిత్రమైన చిరునవ్వు కదిలి, ముఖమంతా పరుచుకుని కళ్ళల్లోకి పాకి, అక్కడ స్థిరపడింది. ఆమె కళ్ళు ఏదో వింత కాంతితో వెలుగుతున్నాయి

ఏదో దైవశక్తి ప్రేరేపించినట్టుగా ఆమె వొక్కసారి కదిలి, గీత వొడిలోంచి మంచమ్మీదికి జారి పడిన భగవద్గీతను, వణుకుతున్న చేత్తో తెరిచి, మధ్యలో వొక శ్లోకం దగ్గర చూపుడు వేలుతో సూచిస్తూ చదివి వినిపించ మన్నట్టుగా సైగ చేసింది

దిగ్భ్రాంతి నుంచి తేరుకొని చదవడం మొదలు పెట్టింది గీత

"జాతస్య హి ధ్రువో మృత్యు ధ్రువం జన్మ మృతస్యచ

తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచి తమర్హసి'

–పుట్టిన వానికి చావు తప్పదు. చచ్చిన వానికి పుట్టుక తప్పదు. తప్పనిసరియగు ఆ విషయమున నీవిక శోకించుట యుక్తము కాదు.

శ్లోకానికి అర్థం చదువుతుండగా, నాయనమ్మ ఆ శ్లోకమే ఎందుకు చదవమన్నదో స్ఫురించి, వులిక్కిపడింది గీత.

చదవడం పూర్తి చేసి ముఖం పైకెత్తి చూసిన గీతకు ఎదురుగా మంచంలో చలనం ఆగిపోయినట్టుగా అనిపించి చటుక్కున లేచి నిలబడింది... ముందుకు వంగి నాయనమ్మ వంటి మీద చేయివేసి చూసి గొల్లుమంది

ఇంట్లో వాళ్ళంతా గబగబా బయటికి వచ్చి మంచం చుట్టూ చేరి బావురుమన్నారు.

మలిసంధ్య వెలుతురు మంచమ్మీద చిక్కగా పరుచుకుంది.

కాంతమ్మ గారి కంటికొలుకులో నిలిచిన వొక కన్నీటి బిందువు, నీరెండలో నిప్పుకణంలా మెరిసి ఆవిరైంది.

పడమటి ఆకాశంలో సూర్యదీపం కొండెక్కింది.

కాని, ఆమె తెరిచి వున్న కళ్ళు తనతో ఏదో మాట్లాడుతున్నట్టూ, నిర్జీవమైన ఆ చూపులు తనకేదో బోధిస్తున్నట్టూ యింకా అనిపిస్తూనే వుంది గీతకు

●



## 'రినీ' వివాహం

ఢిల్లీ దూరదర్శన్ కేంద్రంలో న్యూస్ రీడర్‌గా పనిచేస్తున్న పాప్యులర్ అమ్మాయి రినీ సైమన్-దీపక్‌ఖన్నాలకు యిటీవల వివాహం జరిగింది. ఖన్నా కువైట్ ఎయిర్‌వేస్‌లో పనిచేస్తున్నారు. అంచేత యిప్పుడు రినీ సైమన్‌కు విమానాల మీద ఇంకా ఎక్కువ తిరిగే అవకాశాలు వచ్చాయన్న మాట. ఆమె సాధారణంగా యింట్లో గౌనులే ధరిస్తుందిట. మరి 'ఖన్నా' కుటుంబం ఏమంటారో? దీనికి. ఇది కేరళ పంజాబీల సమ్మేళనం.